ప్రజాశక్తి

గురువారం 30 జనవరి 2025

5

విజయనగరం

బాధ్యతలు స్వీకరిస్తున్న ఎపిసి రామారావు

సమగ్ర శిక్ష ఎపిసిగా రామారావు బాధ్యతలు స్వీకరణ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జిల్లా సమగ్ర శిక్ష అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్‌గా ఎ.రామారావు బుధవారం బాధ్యతలు చేపట్టారు. పార్వతీపురం హార్టికల్చర్ కాలేజీలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న ఆయనను జిల్లా సమగ్ర శిక్ష ఎపిసిగా ప్రభుత్వం నియమించింది.

ఎమ్మెల్సీ ఎన్నికకు మోగిన నగారా

- వెలువడిన షెడ్యూల్
- 3న నోటిఫికేషన్
- పదో తేది వరకు నామినేషన్ల స్వీకరణ
- 27న పోలింగ్
- మార్చి 3న ఓట్ల లెక్కింపు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు నగారా మోగింది. దీనికి సంబంధించిన షెడ్యూల్ బుధవారం ఎన్నికల కమిషన్ విడుదల చేసింది. తక్షణం జిల్లాలో ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినట్లు జిల్లా ఎన్నికల అధికారి బిఆర్ అంబేద్కర్ ప్రకటించారు. ఎన్నికల నోటిఫికేషన్ ఫిబ్రవరి 3న విడుదల కానుంది. 27న పోలింగ్ జరుగనుంది. విజయనగరం, శ్రీకాకుళం, విశాఖ ఉమ్మడి జిల్లా నియోజకవర్గంతో పాటు కృష్ణా-గుంటూరు గ్రాడ్యుయేట్, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానాల ఎన్నికలకు రంగం సిద్ధమైన సంగతి తెలిసిందే. వీటి ఎన్నికలకు సంబంధించి ఎన్నికల కమిషన్ పచ్చజెండా ఊపింది. 3న నోటిఫికేషన్ వెలువడిన నుంచి 10వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరించనున్నారు. 11న నామినేషన్లు పరిశీలన చేయనున్నారు. 13వ తేదీ వరకు నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం ఉంటుంది. ఫిబ్రవరి 27న ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు పోలింగ్ జరుగనుంది. మార్చి 3న ఓట్ల లెక్కింపు జరుగనుంది.

6 జిల్లాలు.. 21,555 మంది ఓటర్లు

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గంలో ఆరు జిల్లాల పరిధిలో 21,555 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో 12,948 మంది పురుషులు కాగా, 8607 మంది మహిళలు ఉన్నారు. అత్యధికంగా విశాఖ జిల్లాలో 5,277 మంది ఉన్నారు. విజయనగరం జిల్లాలో 4,937 మంది, పార్వతీపురం మన్యంలో 2262 మంది, అల్లూరి సీతారామరాజు జిల్లాలో 1448 మంది టీచర్లు ఓటర్లుగా నమోదయ్యారు. 2019లో జరిగిన ఎన్నికల్లో ఓటర్ల సంఖ్య 19,587 మంది కాగా, ఈసారి స్వల్పంగా పెరిగారు. ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన తరువాత ఓటర్ల నమోదుకు ఎన్నికల సంఘం మరోసారి అవకాశం ఇవ్వనున్నట్టు సమాచారం.

ముగ్గురు మధ్యే ప్రధాన పోటీ

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికకు ప్రధానంగా ముగ్గురు అభ్యర్థులు పోటీ పడనున్నారు. యుటిఎఫ్ బలపర్చిన పిడిఎఫ్ అభ్యర్థిగా కోరెడ్ల విజయగౌరి పోటీ చేయనున్న విషయం తెలిసిందే. ఇప్పటికే ఆమె అభ్యర్థిత్వాన్ని యుటిఎఫ్ నాయకత్వం ప్రకటించింది. అలాగే ప్రస్తుత ఎమ్మెల్సీ పి.రఘువర్మ మరోసారి ఎపిటిఎఫ్ తరుపున పోటీ చేసేందుకు సిద్ధమవుతున్నారు. మరోవైపు మాజీ ఎమ్మెల్యే గాదె శ్రీనివాసులు నాయుడు పిఆర్‌టియు నుంచి పోటీలో ఉన్నట్లు ప్రకటించారు. వీరే కాకుండా ప్రైవేటు విద్యాసంస్థల తరపున కొందరు, అధ్యాపకుల సంఘం తరపున ఒకరు పోటీ చేసేందుకు సిద్ధమవుతున్నట్టుగా ప్రచారం ఉంది. అయినప్పటికీ ప్రధాన పోటీ విజయగౌరి, రఘువర్మ, శ్రీనివాసులనాయుడు మధ్యే ఉండే అవకాశాలు కనిపిస్తున్నాయి.

పిడిఎఫ్ అభ్యర్థి విజయగౌరి ఇప్పటికే మూడు ఉమ్మడి జిల్లాల్లోనూ ఒక దఫా ప్రచారం చేపట్టారు. ఉపాధ్యాయులను, సంఘాలను కలిసి తనకు మద్దతివ్వాలని కోరారు. పిడిఎఫ్ అభ్యర్థులు శాసనమండలిలో ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలపై చేస్తున్న కృషిని వివరించి, తనను గెలిపిస్తే ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి మరింత కృషి చేస్తానని తెలిపారు.

మిగిలిన ఇద్దరూ ఇప్పటికే ఎమ్మెల్సీలుగా పనిచేసినప్పటికీ ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి పెద్దగా కృషి చేయకపోవడం, విద్యారంగంలో ప్రభుత్వం అనుసరిస్తున్న వినాశకర విధానాలపైనా నోరు మెదపకపోవడం వల్ల ఈసారి విజయగౌరికి సానుకూల అవకాశాలు ఉన్నాయని ఉపాధ్యాయుల్లో చర్చనడుస్తోంది. ఇందుకు తగ్గట్టే ఆమె యుటిఎఫ్ నేతగా విద్యారంగం, ఉపాధ్యాయ రంగ సమస్యలపై సమరశీల పోరాటల్లో చురుకుగా పాల్గొంటున్న సంగతి తెలిసిందే.

పనితీరు మెరుగుపడకపోతే వేటు

- పిఆర్ ఇంజినీర్లపై మండిపడ్డ కలెక్టర్
- ఎపిఒలపైనా తీవ్ర ఆగ్రహం
- నలుగురిపై చర్యలకు ఆదేశం
- ఉపాధి పనులపై సమీక్ష

ప్రజాశక్తి-విజయనగరంకోట

పంచాయతీరాజ్ ఇంజినీర్లు, ఉపాధిహామీ ఎపిఒలు, ఎపిడిలు తమ పనితీరును మెరుగుపర్చుకోకపోతే సస్పెన్షన్ వేటు వేస్తామని కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ హెచ్చరించారు. ఇన్నాళ్లూ హెచ్చరికలకే పరిమితం అయ్యామని, ఇకనుంచీ చర్యలు మొదలు పెడుతున్నామని ప్రకటించారు. ఉపాధిహామీ మెటీరియల్ కాంపోనెంట్ పనులు, గోకులాలు, పనిదినాల కల్పనపై కలెక్టరేట్‌లో బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. మండలాల వారీగా ఫేజ్1,2,3 పనులపై సమీక్షించారు. అధ్వానంగా పనితీరును కనబరిచిన అధికారులపై తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. బొబ్బిలి పిఆర్ ఎఇకి, సంబంధిత డిఇ, ఇద్దరు ఎపిఎంలకు షోకాజ్ నోటీలు ఇవ్వాలని కలెక్టర్ ఆదేశించారు.

ఉపాధిహామీ మెటీరియల్ కాంపోనెంట్ కింద సుమారు 280 కోట్ల విలువైన సిసి, బిటి రోడ్లు, డ్రైన్లు తదితర 2,851 పనులను 3 దశల్లో మంజూరు చేసినట్లు తెలిపారు. వీటిలో 1171 పనులను మాత్రమే నేటివరకు పూర్తి చేయడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. మూడు నెలల్లో కేవలం 40 శాతం పనులు మాత్రమే పూర్తి చేశారని, నిధుల వినియోగం మరింత అధ్వాన్నంగా ఉందని అన్నారు. జిల్లాకు అందుబాటులో ఉన్న రూ.330 కోట్ల రూపాయలను పూర్తిగా వినియోగించుకొని, రోడ్లు కాలువలు తదితర మౌలిక సదుపాయాలను కల్పించాల్సిందేనని స్పష్టం చేశారు. అందుబాటులో ఉన్న నిధులను పూర్తిస్థాయిలో వినియోగించు కోలేకపోతే, వచ్చే ఏడాది నిధులు తగ్గిపోయే ప్రమాదం ఉందని అన్నారు. ఎట్టి పరిస్థితిలోనూ జిల్లా ప్రజలు నష్టపోకూడదని ఆదేశించారు. వారం వారం లక్ష్యాలను నిర్దేశించి, వాటిని పర్యవేక్షించాలని సూచించారు. ఎఇలుగా ఇన్‌ఛార్జిలు ఉన్నచోట, వారి స్థానంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్లను నియమించాలని సూచించారు. పనిదినాల కల్పనలో కూడా జిల్లా వెనుకబడి ఉండటం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. రేపటినుంచి ప్రతీ గ్రామంలో ఉపాధి పనులు జరగాల్సిందేనని, ప్రజలకు విస్తత స్థాయిలో పని కల్పించాలని, వంద రోజుల పని కల్పన లక్ష్యాలను పూర్తి చేయాలని ఆదేశించారు. ఇకనుంచీ ఈ పనులపై ప్రతీరోజూ ఉదయం, సాయంత్రం రెండు పూటలా సమీక్షిస్తామని చెప్పారు. ఫిబ్రవరి 5వ తేదీలోగా జిల్లాలో మంజూరైన గోకులాలు అన్నీ పూర్తి కావాల్సిందేనని, లేదంటే చర్యలకు సిద్ధంగా ఉండాలని ఎపిఒలకు స్పష్టం చేశారు. సమావేశంలో పంచాయతీరాజ్ ఎస్ఇ ఎం.శ్రీనివాస్, డ్వామా పీడీ ఎస్.శారదాదేవి, ఇంజినీర్లు, ఎపిడిలు, ఎపిఒలు పాల్గొన్నారు.

అవగాహనతోనే ప్రమాదాల నియంత్రణ : ఎస్‌పి

ప్రజాశక్తి-విజయనగరంకోట

ప్రమాదాల నియంత్రణకు రహదారి భద్రత పట్ల అవగాహన కల్పించాలని అధికారులను జిల్లా ఎస్‌పి వకుల్‌జిందాల్ ఆదేశించారు. ఈనెల 16 నుంచి ఫిబ్రవరి 15వరకు రహదారి భద్రత మాసోత్సవాలు నిర్వహిస్తున్న నేపథ్యంలో ప్రమాదాలను నియంత్రించుటకు రహదారి భద్రత పట్ల ప్రజలకు, వాహనదారులకు అవగాహన కల్పించాలన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించే విధంగా చూడాలని, సెల్ ఫోన్లు మాట్లాడుతూ డ్రైవింగు చేయకుండా చూడాలని, హెల్మెట్ ధరించడం వలన కలిగే ప్రయోజనాలను, ప్రమాదాల్లో స్వల్పగాయాలతో ఎలా ప్రాణాలతో సురక్షితంగా భయటపడవచ్చునో ద్విచక్ర వాహనదారులకు వివరించాలన్నారు. హెల్మెట్స్ ద్విచక్ర వాహనాలపై ప్రయాణించే సమయంలో గాలి, దుమ్ము నుండి రక్షించడంతోపాటు, సురక్షిత ప్రయాణాన్ని అందిస్తాయన్నారు. డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు చేపట్టికఠినంగా వ్యవహరించి, కేసులు నమోదు చేయాలన్నారు. ఇప్పటికే ప్రతీ పోలీసు స్టేషను పరిధిలో గుర్తించిన బ్లాక్ స్పాట్స్ వద్ద రహదారి ప్రమాదాలు జరగకుండా బ్లాక్ స్పాటుకు ఇరువైపులా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని తెలిపారు.

తీరంలో ఆగని తాబేళ్ల మృత్యువాత

ప్రజాశక్తి- భోగాపురం

తీరంలో మృత్యువాత పడిన తాబేళ్లు

సముద్ర తీరంలో తాబేళ్లు మృత్యువాతకు అంతు లేకుండా పోయింది. ఇప్పటికే భోగాపురం, పూసపాటిరేగ తీర ప్రాంతాల్లో వందల సంఖ్యలో తాబేళ్లు మృతి చెందిన విషయం తెలిసిందే. తాజాగా చేపల కంచేరు తీరంలో ఒకే చోట ఆరు తాబేళ్లు మృతి చెంది ఉన్నాయి. తాబేలు గుడ్లు పెట్టే సీజన్ కావడంతో తీరానికి చేరే సమయంలో మర పడవల వేట కారణంగా ఇవి చనిపోతున్నాయని అధికారులు అంటున్నారు. తీరానికి దగ్గరలో మర పడవల వేటను నిషేధించాలని పలువురు కోరుతున్నారు.

ప్రతిరోజూ వినతుల స్వీకరణ

కలెక్టరేట్‌లో ప్రత్యేక కౌంటర్‌ను ప్రారంభించిన జెసి

రాష్ట్రంలో తొలిసారిగా జిల్లాలో అమలు

ప్రజాశక్తి-విజయనగరం కోట

ప్రతీరోజూ గ్రీవెన్స్ ఫిర్యాదులు, వినతుల స్వీకరణ కార్యక్రమం గురువారం నుంచి ప్రారంభం కానుంది. కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆదేశాల మేరకు, రాష్ట్రంలోనే మొట్టమొదటి సారిగా ప్రతిరోజూ పిజిఆర్ఎస్ ప్రక్రియను విజయనగరం జిల్లాలో ప్రారంభించారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారానికి వినతులను అన్ని పనిదినాల్లో ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఇవ్వవచ్చు. ప్రతీ సోమవారం నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక తరహాలోనే ఈ వినతులను కూడా పరిగణించి, వాటిని ఆన్‌లైన్‌లో నమోదు చేసి, నంబర్ కూడా కేటాయిస్తారు. దీనివల్ల వినతులను అందజేయడానికి సోమవారం వరకు వేచి ఉండాల్సిన అవసరం లేదు. దీనికోసం కలెక్టరేట్ పోర్టికోవద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్‌ను జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్ బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో కలెక్టరేట్ ఎఒ దేవ్ ప్రసాద్, ఎన్నికల సూపరింటెండెంట్ భాస్కరరావు పాల్గొన్నారు.

స్పెషల్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ పోస్టుకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-విజయనగరం లీగల్

విజయనగరం జ్యుడిషియల్ జిల్లా పరిధిలో రెండో తరగతి స్పెషల్ జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ పోస్టు భర్తీ కోసం అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు జిల్లా జడ్జి బి.సాయికళ్యాణ్ చక్రవర్తి తెలిపారు. ఈ పోస్టుకు ఎంపికైన వారికి నెలకు రూ.45,000 పారితోషికంగా, రూ.5000 రవాణాభత్యం కింద చెల్లిస్తారని తెలిపారు. ఎపి న్యాయసేవల విభాగంలో ఏదైనా ఉద్యోగ బాధ్యతలు నిర్వహించి ఉద్యోగ విరమణ చేసినవారు, జ్యుడిషియల్ మినిస్టీరియల్ విభాగంలో సూపరింటెండెంట్‌కు తక్కువ కాకుండా పనిచేసి న్యాయశాస్త్రంలో డిగ్రీ కలిగి వున్నవారు, హైకోర్టులో సెక్షన్ ఆఫీసర్ ఆపైస్థాయి పదవిలో చేసినవారు, గతంలో న్యాయవాదిగా కనీసం ఐదేళ్లు ప్రాక్టీసు చేసి ప్రస్తుతం బార్ కౌన్సిల్ లో సభ్యత్వం లేనివారు, లా డిగ్రీ కలిగివున్న రిటైర్డ్ గెజిటెడ్ అధికారులు కనీసం మూడేళ్లపాటు మెజిస్టీరియల్ అధికారాలు వినియోగించి వున్నట్లయితే అర్హులని పేర్కొన్నారు. ఉద్యోగ విరమణ చేసిన న్యాయాధికారులకు ఎంపికలో ప్రాధాన్యత వుంటుందన్నారు.

న్యాయవాద వృత్తిలో కనీసం ఐదేళ్ల అనుభవం కలిగిన, ప్రస్తుతం ప్రాక్టీసులో లేని న్యాయవాదులు 45 సంవత్సరాలకు పైబడి వయస్సు కలిగి వుండాలని, రిటైరైన వారు దరఖాస్తు చేసుకున్నట్లయితే 65 ఏళ్ల లోపు వయసు కలిగిన వారు అర్హులని తెలిపారు. అయితే 65 ఏళ్ల పూర్తికావడానికి ఏడాదిన్నర సమయం వున్నవారు మాత్రమే అర్హులని పేర్కొన్నారు.అభ్యర్థులు తమ దరఖాస్తుతో పాటు జనన ధ్రువపత్రం, విద్యార్హతలకు సంబంధించిన ధ్రువపత్రాలు, ఐ.పి.సి, సి.ఆర్.పి.సి. టెస్టుల ఉత్తీర్ణతకు సంబంధించిన ధ్రువపత్రాలు, పెన్షన్ చెల్లింపు ఆర్డర్, గెజిటెడ్ అధికారిగా పనిచేసిన సమయంలో మేజిస్టీరియల్ అధికారాలను ఉపయోగించినట్టు ఆధారాలు, న్యాయవాదులైతే బార్‌లో ఎక్కడా ప్రాక్టీసు చేయడంలేదని ధ్రువపత్రంతోపాటు, గతంలో ఐదేళ్ల న్యాయవాద వృత్తిలో కొనసాగినట్టు ధృవపత్రాలు సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు. పేరు, తండ్రి పేరు, అడ్రసు, విద్యార్హతలు, పుట్టినతేదీ, రిటైరైన తేదీ, గతంలో ఏపోస్టులో పనిచేశారు, దరఖాస్తు చేస్తున్న పోస్టు పేరు, ఉద్యోగ విరమణ చేసే సమయానికి ఏ పదవి నిర్వహించారనే పూర్తి సమాచారంతో దరఖాస్తులను ఫిబ్రవరి 15వ తేదీలోగా జిల్లా జడ్జి, జిల్లా న్యాయస్థానాల సముదాయం, ఫూల్‌బాగ్, విజయనగరానికి పంపించాలని కోరారు.

కరాటే శిక్షణ ఇచ్చేందుకు దరఖాస్తుల ఆహ్వానం

డిఇఒ యు.మాణిక్యం నాయుడు

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

జిల్లాలో అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో 6 నుండి 9 తరగతుల్లో చదువుతున్న బాలికలకు రాణి లక్ష్మీబాయి ఆత్మ రక్షా శిక్షణ-ఆత్మరక్షణ (కరాటే) కార్యక్రమాన్ని అమలు చేసేందుకు అర్హతగల ఏజెన్సీల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డిఇఒ యు.మాణిక్యం నాయుడు తెలిపారు. మార్షల్ ఆర్ట్స్ నేర్చుకోవడం ద్వారా వారి ఆత్మరక్షణ యంత్రాంగాన్ని వివిధ స్వీయ రక్షణ పద్ధతులను తెలుసుకోవడమే కాకుండా, శారీరక ధృఢత్వం, ఆత్మవిశ్వాసం, మానసిక ఆరోగ్యం పొందడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఫిబ్రవరి 1న ఉంచి మార్చి 15వరకు పాఠశాలల్లో బాలికలకు కరాటే శిక్షణ ఇవ్వాల్సి ఉంటుందని, తెలిపారు. ఇది వరలో విద్యా సంస్థలలో శిక్షణ అనుభవం కలిగిన, అర్హత కలిగిన ఏజెన్సీల నుండి దరఖాస్తులను ఫిబ్రవరి 1లోగా ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఏజెన్సీ అందించే శిక్షకులు తప్పనిసరిగా కనీసం ఒక మార్షల్ ఆర్ట్స్ లేదా స్వీయరక్షణ సర్టిఫికేట్ పొందాలని, ఫిబ్రబరి 3 మధ్యాహ్నం 2గంటల నుండి అర్హత పరిశీలన, ఎంపిక కార్యక్రమం సమగ్ర శిక్షా కార్యాలయంలో జరుగుతుందని తెలిపారు.

నేషనల్ గేమ్స్‌కు జ్యూరీగా భగవాన్‌దాస్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఉత్తరాఖండ్ రాష్ట్రంలో జరుగుతున్న జాతీయ క్రీడాపోటీల్లో వాలీబాల్ పోటీలకు జిల్లాకు చెందిన రాష్ట్ర వాలీబాల్ అసోసియేషన్ కార్యదర్శి భగవాన్ దాస్ జ్యూరీగా ఎంపికయ్యారు. ఈమేరకు జాతీయ పోటీల గేమ్స్ డైరెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. దీంతో ఉత్తరాఖండ్‌కు పయనమై వెళ్లారు. ఆయన ఎంపిక పట్ల జిల్లా వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు జి.సూరిబాబు, కెవిఎఎన్ రాజు అభినందనలు తెలిపారు.

ఆతవ రోడ్డు కోసం కొనసాగిన నిరసన

ఎమ్మెల్యే హామీ ఇచ్చినా ఆందోళన విరమించని గ్రామస్తులు

ప్రజాశక్తి - వేపాడ

నిరసన శిబిరంలో పాల్గొన్న నాయకులు, గ్రామస్తులు

ఆతమ గ్రామానికి రోడ్డు నిర్మించాలని డిమాండ్ చేస్తూ గ్రామస్తులు మూడోరోజు బుధవారం కూడా ఆందోళన కొనసాగించారు. నిరసన శిబిరాన్ని సందర్శించిన ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి ఫిబ్రవరి 15న రహదారి పనులకు ప్రారంభిస్తామని తెలిపారు. కానీ అక్కడ ప్రజలు, నాయకులకు ఆమె మాటపై నమ్మకం లేక పనులు ప్రారంభించేంత వరకూ నిరసన తెలుపుతామని చెబుతూ శిబిరాన్ని కొనసాగించారు. నిరసన కార్యక్రమానికి సిపిఎం నాయకుడు చల్లా జగన్‌తో పాటు గ్రామ సర్పంచ్ గొంప రామ్‌నాయుడు, ఉద్యమ నేత ఆతవ ఉదయ భాస్కర్, ఎంపిపి డి.సత్యవంతుడు, జెడ్‌పిటిసి సేనాపతి అప్పలనాయుడు, మాజీ డిసిసిబి చైర్మన్ వేచలపు వెంకట చిన్నరామనాయుడు, వైస్ ఎంపిపి ఈశ్వర్‌రావు, మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు ఎన్. వెంకటరావు, అరిగి పాలెం ఎంపిటిసి టి.వి. రమణ, వైసిపి మండల అధ్యక్షుడు ఎం.జగ్గు బాబు, సోంపురం ఎంపిటిసి ఆకుల సత్యనారాయణ, చామలాపల్లి సర్పంచ్ సతీష్, చినుగుడిపాల సర్పంచ్ బి.రామునాయుడు, ద్వారపూడి గంగునాయుడు, గ్రామ పెద్దలు జగన్, నూకరాజు, మద్దతు పలికారు. దీనికి ముందు శిబిరం ముందు ఎమ్మెల్యేను వారు అడ్డుకుని రోడ్డు నిర్మించాలని ప్రశ్నించారు.

ఎమ్మెల్యే కారు వద్ద నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

హెల్మెట్ వినియోగం తప్పనిసరి : కలెక్టర్

ప్రజాశక్తి-విజయనగరంకోట

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ బిఆర్ అంబేద్కర్

జిల్లా అంతటా వాహనం నడిపేవారికి హెల్మెట్ల వినియోగం తప్పనిసరి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ తెలిపారు. వచ్చే రెండు నెలల్లో పూర్తిగా అమలు జరిగేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. హెల్మెట్ల వినియోగం పై ప్రజలకు అవగాహన కలిగించాలన్నారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరలో జిల్లా రహదారి భద్రతా కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాను ప్రమాదాల రహిత జిల్లాగా నిలిపేందుకు కృషి చేయాలని తెలిపారు. ఇందుకోసం రవాణా, పోలీస్, జాతీయ రహదారుల, మున్సిపల్ శాఖల అధికారులు సంయుక్తంగా ఒక కార్యాచరణ ప్రణాళిక తయారు చేయాలని ఆదేశించారు. ఎక్కువగా ప్రమాదాలు జరిగే ప్రదేశాలను గుర్తించి ప్రమాదాల నివారణకు తగు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో అదనపు ఎస్.పి సౌమ్య లత, రవాణా డిప్యూటీ కమిషనర్ మణికుమార్ , ఆర్అండ్‌బి ఎస్ఇ కాంతిమతి, డిఎంహెచ్ఒ డాక్టర్ జీవనరాణి, ఆర్‌టిఒ విమల, మోటార్ వెహికల్ ఇనెస్పెక్టర్లు పాల్గొన్నారు.

31న పలు గ్రామాలకు విద్యుత్తు సరఫరా నిలిపివేత

ఇఇ త్రినాథరావు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

గంట్యాడ సబ్ స్టేషన్ పరిధిలోని వసంత రూరల్ ఫీడర్ లైన్ పరిధిలో చెట్ల కొమ్మలు తొలగించే ప్రక్రియ కారణంగా గురువారం పలు గ్రామాలకు ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేస్తామని విద్యుత్తుశాఖ ఇఇ త్రినాథరావు తెలిపారు. సిరిపురం, రావివలస, మురపాక, పెదవెమలి, గ్రామాలకు అదేవిధంగా 33/11కెవి కొండతామరపల్లి సబ్ స్టేషన్ పరిధిలో కొండతామరాపల్లి రూరల్ ఫీడర్ పరిదిలో ఉన్న పెదమజ్జిపాలెం, కొవ్వాడ పేట, యడ్లపాలెం, ఎం కొత్త పాలెం, మరువాడ, ఎం కొత్త వలస, జె.గుమడాం, వెదురువాడ, కొండపేట, కొత్త పనసాలపాడు, పాత పనసల పాడు, పాత పనసాలా పాడు, గదనపేట, పడిపేట, మూలపాడు గ్రామాలకు విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు.

సముద్రతీరంలో అటవీశాఖ భూములకు హద్దులు

- రెండు మండలాల్లో సుమారు వెయ్యి ఎకరాల ఫారెస్టు భూములు
- అన్యాక్రాంతం కాకుండా హద్దుస్తంభాలు ఏర్పాటు

ప్రజాశక్తి- భోగాపురం

తీరం ఒడ్డున నిర్మిస్తున్న హద్దు స్తంభం

సముద్ర తీరంలో ఉన్న అటవీశాఖకు చెందిన భూముల రక్షణకు ఆ శాఖ అధికారులు చర్యలు చేపడుతున్నారు. దీనిలో భాగంగా ఈ భూములు అన్యాక్రాంతం కాకుండా ఉండేందుకు సర్వే చేసి శాశ్వతంగా ఉండే హద్దులను నిర్మిస్తున్నారు. మండలంలోని చేపలకంచేరు నుంచి పూసపాటిరేగ మండలం చింతపల్లి వరకు ఉన్న భూములను కాపాడే లక్ష్యంగా చర్యలు తీసుకుంటున్నారు. దీనివలన భూముల ఆక్రమణలు కాకుండా ఉండేందుకు రక్షణ చర్యల్లో భాగంగా ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నామని అధికారులు అంటున్నారు. జిల్లాలో సముద్ర తీరం ఉన్న భోగాపురం, పూసపాటిరేగ మండలాల్లో తీరాన్ని ఆనుకొని సుమారు వెయ్యి ఎకరాలు అటవీశాఖకు చెందిన భూములు ఉన్నాయి. పూసపాటిరేగలో సుమారు 900 ఎకరాలు, భోగాపురంలో వంద ఎకరాల వరకు ఉన్నాయి. అంతర్జాతీయ విమానాశ్రయం నిర్మిస్తుండడంతో ఈ ప్రాంతంలో భూములకు భారీగానే ధరలు ఉన్నాయి. సెంటు భూమి లక్షల్లోనే పలుకుతుండడం విశేషం. కాని అటవీశాఖ భూములు సముద్ర తీరానికి ఆనుకొని ఉండడంతో వీటి విలువ భారీగానే ఉంది. ఈనేపథ్యంలోనే ఈ భూములను కాపాడేందుకు అటవీశాఖ అధికారులు పటిష్ట చర్యలు ప్రారంభించారు.

పిరమిడ్ లాంటి స్తంభాలతో హద్దుల వద్ద నిర్మాణం

సముద్ర తీరంలో ఇంతకు ముందు ఈ భూములకు హద్దులను తెలుసుకునేందుకు కనీసం ఒక్క రాయి కూడా ఉండేది కాదు. ఇంతకు ముందు చేసిన సర్వే ఆధారంగా హద్దులను గుర్తించారు. గుర్తించిన హద్దుల వద్ద పిరమిడ్ ఆకారంలో శాశ్వతంగా ఉండేలా స్తంభాలను నిర్మిస్తున్నారు. ముఖ్యంగా ఇటు రైతుల భూముల వైపు అటు సముద్ర తీరానికి దగ్గర్లో వారికున్న అటవీ భూములని తెలిసేలే రెవెన్యూ గ్రామంతో పాటు అటవీశాఖ భూములని స్తంభాలపై ఆంగ్లంలో రాస్తున్నారు. ప్రస్తుతం మండలంలో ఈ హద్దుల స్తంభాలు పూర్తి అయ్యాయని అటవీశాఖ అధికారులు తెలిపారు. పూసపాటిరేగలో హద్దుల వద్ద స్తంభాలను నిర్మించనున్నట్లు తెలిపారు.

సమస్యలను సత్వరమే పరిష్కరించాలి

రామభద్రపురం: మండలంలో ఇటీవల నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన ఫిర్యాదులన్నీ సత్వరమే పరిష్కరించాలని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సూరజాకు ఆదేశించారు. మండల రెవెన్యూ కార్యాలయంలో బుధవారం ఆయన రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన ఫిర్యాదులను పరిశీలించి వాటిపై ఆడిట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇప్పటివరకు ఎన్ని సమస్యలు పరిష్కరించారు, ఇంకా ఏ విధమైన సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయన్న విషయాలను రెవెన్యూ అధికారులను అడిగి తెలుసుకున్నారు. రైతుల నుంచి వచ్చిన 196 ఫిర్యాదులను కంప్యూటర్‌లో ఆన్‌లైన్ పరిష్కరించినట్లు తహశీల్దార్ సులోచనారాణి తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌డిటి శేఖర్, పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ జిల్లాగా విజయనగరం

వేపాడ: విజయనగరం జిల్లాను ప్రకృతి వ్యవసాయ జిల్లాగా ప్రభుత్వం గుర్తించిందని ప్రాజెక్టు మేనేజర్ ఆనందరావు అన్నారు. మండలంలోని బొద్దాం, వీలువర్తి గ్రామంలో ప్రకృతి వ్యవసాయ సాగు చేస్తున్న రైతులతో బుధవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం మన జిల్లాను ప్రకృతి వ్యవసాయ జిల్లాగా గుర్తించిందన్నారు. జిల్లాలో రైతులందరూ ప్రకృతి వ్యవసాయం చేసేందుకు ముందుకు రావాలన్నారు. ఈ సమావేశంలో సర్పంచ్‌లు శానపతి లీలా అప్పారావు, ఎర్ర సత్యవతి, ఎంపిటిసి పిల్లి లక్ష్మి, సిఎస్‌ఎ కోఆర్డినేటర్ పసల వెంకటరావు, మాజీ ఎంపిటిసి జగ్గారావు, మాజీ సర్పంచ్ జి ఈశ్వరరావు, వరప్రసాద్, ఎఎల ఠాకూర్, పాల్గొన్నారు.

బ్రిడ్జి కోర్సుకు దరఖాస్తుల స్వీకరణ

బొబ్బిలి: ఐటిఐ రెండేళ్లు పూర్తి చేసిన విద్యార్థులు పాలిటెక్నిక్ కోర్సు రెండో సంవత్సరంలో చేరాలనుకుంటే ప్రవేశ బ్రిడ్జి కోర్సు ప్రభుత్వ ఐటిఐలో శిక్షణ ఇస్తున్నట్లు ప్రిన్సిపల్ జివి రమణారావు ఒక ప్రకటనలో తెలిపారు. రెండేళ్ల ఐటిఐ పూర్తి చేసి పాలిటెక్నిక్ కోర్సులో చేరాలంటే ప్రవేశ పరీక్షలో అర్హత సాధించాలన్నారు. ప్రవేశ పరీక్షకు సంబంధించిన బ్రిడ్జి కోర్సుకు ఈనెల 22 నుంచి ఫిబ్రవరి 21 వరకు ప్రభుత్వ ఐటిఐలో శిక్షణ ఇస్తామని, ఆసక్తి ఉన్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు ఐటిఐను సంప్రదించాలని కోరారు.

పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

నెల్లిమర్ల: పట్టణ ప్రాంతంలో అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సిపిఐ నాయకులు ఎం. పాపారావు కోరారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నెల్లిమర్ల పట్టణ ప్రాంతంలో గత 30ఏళ్ల నుంచి పేదలు సొంత స్థలాలు లేక ఇబ్బందులు పడుతున్నారని వారికి నెల్లిమర్ల మండల కేంద్రంలోనే స్థలాలిచ్చి ఇంటి నిర్మాణాలను ప్రభుత్వమే చేపట్టాలని కోరారు.

ఉద్యోగ విభాగ ఉపాధ్యక్షులుగా బోనంగి

తెర్లాం: మండలంలోని ఎన్.బూర్జివలస గ్రామానికి చెందిన బోనంగి తిరుపతిరావు రాష్ట్ర తూర్పు కాపు సంక్షేమ సంఘం ఉద్యోగ విభాగానికి ఉపాధ్యక్షులుగా నియమితులయ్యారు. ఈ మేరకు జాతీయ అధ్యక్షులు పిసిని చంద్రమోహన్ నియామక పత్రాన్ని అందజేశారు. ఈ నియామకం వల్ల తనకు గౌరవం, బాధ్యత పెరిగిందని, రాష్ట్రంలో ఉన్న తూర్పు కాపుల అభివృద్ధికి, అభ్యున్నతికి మరింత కృషి చేస్తానని ఈ సందర్భంగా బోనంగి తిరుపతిరావు తెలిపారు.

ఘనంగా జంతు సంక్షేమ పక్షోత్సవాలు

లక్కవరపు కోట: మండల కేంద్రంలోని కెజిబివిలో 9వ తరగతి బాలికలకు బుధవారం జంతు సంక్షేమం, జంతు సంరక్షణ చట్టాలు గురించి పశువైద్యాధికారి కోరాడ గాయత్రి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమం మీద బాలికలకు వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలో గెలుపొందిన విద్యార్థినులకు మొదటి, రెండు, మూడు, రెండు కన్సోలేషన్ బహుమతులు ఆమె అందించారు. పశువుల్ని హింసించడం, హానిచేయడం, గాయపరచడం, జంతువుల చేత బరువులు లాగించడం, ముసలి జబ్బు పడిన పశువుల చేత రవాణా పేరుతో బాధపెట్టడం చట్టరీత్యా నేరమన్నారు. కెజిబివి ప్రిన్సిపాల్ బి.ప్రవీణ పాల్గొన్నారు.

సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలి

గంట్యాడ: సిబ్బంది సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలని జెడ్‌పి సిఇఒ సత్యనారాయణ సూచించారు. బుధవారం స్థానిక మండల పరిషత్తు కార్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించడంతో పాటు పలు విషయాలపై సమీక్ష జరిపారు. ఈ మేరకు వారికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ రమణమూర్తి, ఎఒ రాములమ్మ తదితరులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు

వంగర: యాజమాన్య పద్ధతులు ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చు అని మండల వ్యవసాయ అధికారి టి.కన్నబాబు అన్నారు. మండలంలోని మరువాడలో రైతులకు బుధవారం అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయం ఇన్చార్జి సింహాద్రి నాయుడు మాట్లాడుతూ తూటి కాడ కషాయం తదితర అంశాలపై రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో పవిత్ర పోలినాయుడు రైతులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

గంజాయి కేసులో ఐదుగురు అరెస్ట్

ప్రజాశక్తి - విజయనగరం కోట

గంజాయి కేసులో ఐదుగురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఒకటో పట్టణ సిఐ శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం కంటోన్మెంట్ ఏరియా సౌత్ సెంట్రల్ ట్రాఫిక్ ట్రైనింగ్ కాలేజ్, రైల్వే కాలనీ గూడ్స్‌షెడ్ ప్రాంతంలో గంజాయి అమ్ముతున్నట్టు సమాచారం రావడంతో వెళ్లి వారిని పట్టుకుని వారి దగ్గర నుంచి 2 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని ఎఫ్ఐఆర్ నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని సిఐ తెలిపారు. ఇందులో నలుగురు మేజర్లు ఒక మైనర్ ఉన్నారన్నారు. ఎస్‌కోటకు చెందిన బోర్లమాల తరుణ్ తేజ్, సంపంగి భార్గవ్, విజయనగరం నటరాజ్ కాలనీకి చెందిన సారిక సాగర్, జొన్నగుడ్డకు చెందిన పావడ సాయి చైతన్యగా గుర్తించామన్నారు.

ఎస్.కోటలో వరుస దొంగతనాలు

ప్రజాశక్తి- శృంగవరపుకోట

పట్టణంలో మంగళవారం అర్ధరాత్రి దాటాక మూడు చోట్ల వరుస దొంగతనాలు జరిగాయని ఎస్ఐ గంగరాజు బుధవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని సీతమ్మపేటలో గల కొరియర్ ఆఫీసులో దొంగలు సుమారు 70 వేల రూపాయలు నగదును దొంగలించారన్నారు. వన్వే జంక్షన్ వద్ద గల ఓ మద్యం దుకాణంలో 11 మద్యం ఫుల్ బాటిళ్లను, కొంత నగదును దోచుకున్నారు. విశాఖ అరుకు రహదారిలోని ఓ కిరాణా షాపులో 5 నూనె డబ్బాలు, 4 బియ్యం బస్తాలను దొంగలించారు. ఈ దొంగతనాలన్నీ ఇనుప రాడ్లతో సెట్టర్లను పైకి లేపి దొంగలించారని కేసు నమోదు చేసి సిసి ఫుటేజ్ ఆధారంగా దర్యాప్తు చేస్తున్నామని ఆయన తెలిపారు.

బాలుడు అదృశ్యం

ప్రజాశక్తి - విజయనగరం కోట

స్థానిక నాగవంశపు వీధికి చెందిన జర్జాపు ఫణీంద్ర బుధవారం తెల్లవారు జాము నుంచి కనిపించడంలేదని తండ్రి వాసుదేవరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని సిఐ శ్రీనివాసరావు తెలిపారు. ఇంటర్ చదువుతున్న ఫణీంద్ర తెల్లవారు జామున 5.30గంటలకు ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదన్నారు. స్నేహితులను ఆరా తీసినా, సాయంత్రం వరకు వెతికిన ఫలితం లేకపోవడంతో ఫిర్యాదు చేసినట్లు సిఐ తెలిపారు. ఇంటి నుంచి వెళ్ళిపోయినప్పుడు బ్లూ కలర్ షర్ట్, సిమెంట్ కలర్ బనీను వేసుకొని ఉన్నట్లు తెలిపారు.

చీటింగ్ కేసులో ఆరు నెలల జైలు

ప్రజాశక్తి-విజయనగరంకోట

విజయనగరం వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో 2019లో నమోదైన చీటింగ్ కేసులో నిందితుడికి ఆరునెలల జైలు శిక్ష, రూ.8వేలు జరిమానా విధిస్తూ, కోర్టు తీర్పు వెల్లడించినట్లు సిఐ ఎస్.శ్రీనివాస్ తెలిపారు. గజపతినగరం మండలం పురిటిపెంటకు చెందిన చలుమూరి వెంకట భాస్కరరావు అనే నిందితుడు ఐటి మోసానికి పాల్పడంతో అప్పటి వన్ టౌన్ సిఐ డి.లక్ష్మణరావు అతనిపై కేసు నమోదు చేసి 2019 మే 31న రిమాండ్‌కు తరలించారు. నేరం రుజువు కావడంతో ఆయనకు శిక్ష విధిస్తూ న్యాయస్థానం తీర్పు వెల్లడించినట్లు సిఐ తెలిపారు.

లారీ బీభత్సం.. నలుగురికి గాయాలు

ప్రజాశక్తి-బొండపల్లి

మండల పరిధిలోని సాయిసిద్ధార్థ కళాశాల సమీపంలో బుధవారం సాయంత్రం ఓ లారీ బీభత్సం సృష్టించింది. గజపతినగరం నుంచి విజయనగరం వైపు వస్తున్న లారీ ముందుగా వెళ్తున్న వాహనాలను ఢీకొట్టి దూసుకుపోయింది. ఈ ఘటనలో ఓ కారు, బైక్ నుజ్జునుజ్జు అయ్యాయి. ముగ్గురికి గాయాలు కాగా, సీతానగరం మండలం భద్రంవలసకు చెందిన ముకుంద అనే వ్యక్తి పరిస్థితి విషమంగా ఉంది. ఈయనకు మరో పది రోజుల్లో వివాహం కానుంది. పెళ్లి కార్డులు పంచుతుండగా ఈ ఘటన జరిగింది.

అంగన్‌వాడీలకు గ్రాట్యుటీ అమలు చేయాలి

ప్రజాశక్తి - దత్తిరాజేరు

ఐసిడిఎస్‌ను క్రమబద్ధీకరించి గ్రాట్యుటీ అమలు చేయాలని అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్టు కార్యదర్శి పి. జ్యోతి డిమాండ్ చేశారు. గ్రాట్యుటీ, కనీస వేతనం రూ.26వేలు అమలు తదితర సమస్యలపై మండలంలోని పెద్దమానాపురం, దత్తిరాజేరు సెక్టార్ సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జ్యోతి మాట్లాడుతూ వ్యక్తి గత దరఖాస్తులు రాసి పోస్టల్ ద్వారా రాష్ట్రపతికి పంపిస్తున్నామన్నారు. దశాబ్దాలుగా సర్వీస్ అందిస్తున్న వర్కర్లకు, హెల్పర్లకు కనీస వేతనం అమలు చేయడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో సెక్టార్ లీడర్లు కె.రేణుక, వై.పద్మ, జి.ముత్యాలు, ఆర్.దమయంతి అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

రామభద్రపురం : దరఖాస్తులను ప్రదర్శిస్తున్న అంగన్‌వాడీలు

మెంటాడ: మండలంలోని చల్లపేట సెక్టార్ మీటింగ్‌లో అంగన్‌వాడీ కార్యకర్తలు రాష్ట్రపతికి వ్యక్తిగతంగా దరఖాస్తులు రాసి పోస్టు చేశారు. అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు బి.సుజాత మాట్లాడుతూ కనీస వేతనం ఇవ్వాలని ఐసిడిఎస్ ఏర్పాటు చేసి యాభై ఏళ్లు పూర్తయిందని, ఈ నేపథ్యంలో ఐసిడిఎస్‌ను క్రమబద్ధీకరించి, బడ్జెట్లో కేటాయింపులు పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో సెక్టార్ లీడర్లు ఎస్ పెంటమ్మ, సరస్వతి కార్యకర్తలు పాల్గొన్నారు.

వంగర: అంగన్వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా క్రమబద్ధీకరించాలని అంగన్‌వాడీ కార్యకర్తలు రాష్ట్రపతికి లేఖలు అందించేందుకు బుధవారం సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రూ.26వేలు వేతనం ఇవ్వాలని, అంగన్వాడీలకు, హెల్పర్లకు గ్రాట్యుటీ చెల్లించాలని సరిపడా నిధులు కేటాయించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్యకర్తలు భారతి, కుమారి, రవణమ్మ, మీన, శశికళ పాల్గొన్నారు.

రామభద్రపురం: ఐసిడిఎస్‌ను క్రమబద్ధీకరించి,కనీస వేతనం 26 వేలు ఇస్తూ, గ్రాట్యుటీ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సిఐటియు ఆధ్వర్యంలో వివిధ సెక్టార్‌లలో బుధవారం సమావేశాలు నిర్వహించారు. ప్రతి అంగన్వాడీ చేత వ్యక్తి గత దరఖాస్తు రాయించి పోస్టల్ ద్వారా రాష్ట్రపతికి పంపనున్నామని సిఐటియు మండల కార్యదర్శి బలస శ్రీను, యూనియన్ సెక్టార్ లీడర్లు సత్యవతి, కళ, అరుణ తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ సిబ్బంది లక్ష్మి, శ్రీదేవి, రమ తదితరులు పాల్గొన్నారు.

మెంటాడ : వ్యక్తిగత దరఖాస్తులను ప్రదర్శిస్తున్న అంగన్‌వాడీలు

పూసపాటిరేగ: అంగన్‌వాడీ వ్యవస్థను సంస్థాగతం చేయాలని సిఐటియు నాయకులు బచ్చల సూర్యనారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గుజరాత్ హైకోర్టు ఇచ్చిన ఆదేశాల ప్రకారం అంగన్వాడి వర్కర్లను, హెల్పర్లను గ్రేడ్ 3 గ్రేడ్ 4 ప్రభుత్వ ఉద్యోగులుగా క్రమబద్ధీకరించి కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని కోరారు. అనంతరం మండల కేంద్రంలో అంగన్‌వాడీలంతా రాష్ట్రపతికి దరఖాస్తులు రాశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీలు శ్రీలక్ష్మి ఉమా, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు రూ.50లక్షలు ఇవ్వాలి

ప్రజాశక్తి-బొబ్బిలి

మహా కుంభమేళా తొక్కిసలాట మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.50లక్షలు ఇవ్వాలని సిపిఎం సభ్యులు మువ్వల శ్రీనివాసరావు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం నిర్లక్ష్యం వల్లనే తొక్కిసలాట జరిగిందని విమర్శించారు.

యోగి రాజీనామా చేయాలి

ఉత్తరప్రదేశ్ మహా కుంభమేళాలో తొక్కిసలాటకు ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ నైతిక బాధ్యత వహించి సిఎం పదవికి రాజీనామా చేయాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కోట అప్పన్న బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కుంభమేళాకు రూ.7వేల కోట్లు కేటాయించిన యోగి ప్రభుత్వం భక్తులకు సౌకర్యాలు కల్పించడంలో పూర్తిగా విఫలమైందన్నారు.

ప్రతిజ్ఞ చేస్తున్న గ్రామస్తులు, సిబ్బంది

క్షయపై అవగాహన

ప్రజాశక్తి - నెల్లిమర్ల

నగర పంచాయతీ పరిధిలోని జరజాపుపేటలో క్షయవ్యాధి నిర్మూలనపై బుధవారం అవగాహన కల్పించారు. జాతీయ క్షయ నిర్మూలన 100రోజుల కార్యక్రమంలో భాగంగా ర్యాలీ, అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా నగర పంచాయతీ వైస్ చైర్మన్ సముద్రపు రామారావు మాట్లాడుతూ అవగాహనతో జాగ్రత్తలు పాటిస్తే టిబి వ్యాధిని పూర్తి స్థాయిలో నివారించవచ్చున్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, సూపర్ వైజర్ వీరాస్వామి, శ్రీను, ఎఎన్ఎం అచ్చియ్యమ్మ, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మా వద్ద ఫైల్స్ లేవు ?

- సహ చట్టంపై కలెక్టర్, ఎస్‌పి కార్యాలయం సమాధానం
- చట్టం అపహాస్యం అవుతోందని పలువురు ఆందోళన
- నేడు మండల కేంద్రంలో అవగాహన సదస్సు

ప్రజాశక్తి - జామి

సామాన్య పౌరులకు ప్రభుత్వ కార్యకలాపాలు చేరువ చేయడంతో పాటు ప్రభుత్వ శాఖల్లో సమాచారాన్ని పారదర్శకంగా పొందడానికి అనువైన అవకాశం సమాచార హక్కు చట్టం. ఇది 2005లో అప్పటి యుపి-2 కాంగ్రెస్ ప్రభుత్వం వామపక్షాల మద్దతుతో తీసుకొచ్చిన ఒక గొప్ప చట్టంగా చెప్పవచ్చు. కానీ నేడు సమాచార హక్కు చట్టం అపహాస్యం అవుతోంది. కొంత మంది పౌరులు ఈ చట్టాన్ని బెదిరింపులకు, బ్లాక్ మెయిలింగు కోసం దుర్వినియోగ చేస్తుంటే మరి కొంత మంది ప్రభుత్వ శాఖల్లో పని చేసిన ఉద్యోగులు కూడా ప్రజలు నిజ అవసరాల కోసం పెడుతున్న దరఖాస్తులను అపహాస్యం చేస్తున్న పరిస్థితులు దాపురించాయి. ఇంకొంత మంది అవగాహనా లోపంతో వ్యవహరిస్తే, కొందరు అధికారులు తప్పించుకునే ధోరణిలో వ్యవహరిస్తున్న పరిస్థితులు ఉన్నాయి.

మండల కేంద్రంలో ఇటీవల క్వారీ బ్లాస్టింగులు విషయమై ఎస్‌పి కార్యాలయానికి సమాచారం హక్కు చట్టం 2005 సెక్షన్ 6(1) ప్రకారం ప్రాథమిక సమాచారం కావాలని న్యాయవాది బివి రమణారావు కోరగా తమ వద్ద సమాచారం లేదని, కలెక్టర్ కార్యాలయంలో ఉందని సమాధానం ఇచ్చారు. వాస్తవానికి చట్ట ప్రకారమైతే పౌరుడు కోరిన సమాచారం తమ కార్యాలయానికి సంబంధం లేదనుకుంటే.. ఎక్కడ లభిస్తుందో సెక్షన్ 6(3) ప్రకారం పౌరుడికి, ఆ కార్యాలయానికి పంపాల్సిన బాధ్యత పౌర సంబంధాల అధికారి (పిఐఒ)దే అని చట్టం చెబుతోంది.

కలెక్టర్ కార్యాలయంలోనూ ఇదే పరిస్థితి

జామి పరిసర ప్రాంతంలోని క్వారీ బ్లాస్టింగు విషయమై కలెక్టర్ కార్యాలయానికి కూడా సహచట్టం పెట్టి వివరణ కోరినా ఫలితం లేకపోతుంది. అక్కడ కూడా ఫైల్స్ తమ వద్ద లేవనే సమాధానం వస్తుంది. జిల్లా కలెక్టర్ కార్యాలయంలోనే ఇటువంటి పరిస్థితి ఉంటే ఇక సాధారణ కార్యాలయాలు ఎలా ఉన్నాయో చెప్పాల్సిన పని లేదు. అత్యధిక దరఖాస్తు దారులు చట్టం ముసుగులో అనవసర సమాచారం కోరుతూ, అధికారుల నుంచి డబ్బులు డిమాండ్ చేస్తున్న దురదుష్టకర సందర్భాలూ ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే సమాచార హక్కు చట్టం ఏవిదంగా ఉపయోగించాలి, తప్పుడు దరఖాస్తులకు అధికారులు ఎటువంటి సమాధానాలు ఇవ్వాలన్న అవగాహన ఉంటే ఎవరు, ఎవరికీ బయపడాల్సిన అవసరం లేదని చట్టంపై పూర్తి అవగాహన ఉన్న మేధావులు చెబుతున్నారు. అందులో భాగంగానే రాష్ట్ర సమాచారహక్కు కమిషనర్ ఆదేశాలు మేరకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆర్‌టిఐ పై నేడు అవగాహన సదస్సు ఏర్పాటు చేస్తున్నారు. అత్యధిక సామాన్యులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటారని ఎంపిడిఒ అప్పలనాయుడు కోరుతున్నారు.

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి : డిఎస్‌పి

ప్రజాశక్తి- బొబ్బిలి

మాదకద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని డిఎస్‌పి జి.భవ్యరెడ్డి కోరారు. స్థానిక రాజా కళాశాలలో బుధవారం సంకల్పం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మాదకద్రవ్యాలకు యువత బానిసై జీవితాలను నాశనం చేసుకుంటున్నారని, మాదకద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలన్నారు. గంజాయి అమ్మినా, వాడినా కేసులు నమోదు చేస్తామన్నారు. సైబర్ నేరాలు పెరుగుతున్నాయని, సైబర్ నేరాలు పట్ల అప్రమత్తంగా ఉండాలని కోరారు. క్రమశిక్షణతో చదువుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ సిఐ కె.సతీష్ కుమార్, ట్రాఫిక్ ఎస్ఐ జ్ఞానప్రసాద్, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

చీపురుపల్లి: ఆరోగ్యకరమైన భవిష్యత్తు కోసం మంచి నడవడిక అవసరమని చీపురుపల్లి డిఎస్‌పి ఎస్. రాఘవులు విద్యార్థులకు సూచించారు. స్థానిక గాయత్రీ జూనియర్ కళాశాలలో బుధవారం మాదకద్రవ్యాల వ్యతిరేక అవగాహనా సదస్సు నిర్వహించారు. మాదకద్రవ్యాలు వాడకం వల్ల కలిగే అనర్థాలను విద్యార్థులకు ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో సిఐ జి.శంకరరావు, ఎస్ఐ ఎల్ దామోదర్, కళాశాల ప్రిన్సిపాల్ దాసరి శివప్రసాద్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చీపురుపల్లి: మాట్లాడుతున్న డిఎస్‌పి రాఘవులు

పశువైద్యాన్ని సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి - బొబ్బిలిరూరల్

పశువైద్య సంవర్ధక శాఖ ఉచితంగా నిర్వహిస్తున్న పశు వైద్య శిబిరాలు పాడి రైతులంతా సద్వినియోగం చేసుకోవాలని ఎంపిపి శంబంగి లక్ష్మి అన్నారు. బుధవారం పక్కి, రాజు పేటలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఉచిత పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు. పక్కిలో పాల్గొని ఆమె మాట్లాడారు. పక్కి, పిరిడి పశు వైద్యాధికారులు మాట్లాడుతూ పక్కి పశుఆరోగ్య శిబిరంలో 324 పశువులకు చికిత్సలు, నట్టల నివారణ మందులు, 32 పశువులకు గర్భకోశ వ్యాధి చికిత్సలు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పశువైద్య శిబిరానికి స్పందన

రేగిడి: మండలంలోని అప్పాపురం, మజ్జి రాముడిపేట గ్రామాల్లో బుధవారం నిర్వహించిన పశువైద్య శిబిరానికి అనూహ్య స్పందన లభించింది. సంకిలి పశువైద్యాధికారి దుర్గాప్రసాద్‌బాబు ఆధ్వర్యంలో నిర్వహించిన పశువైద్య శిబిరంలో 332 పశువులకు వైద్య తనిఖీలు నిర్వహించారు. పశువులకు గర్భస్థ పరీక్షలు, నట్టల నివారణ తనిఖీలు, వివిధ రకాల వ్యాధులపై పరీక్షలు నిర్వహించి ఉచిత మందులు పంపిణీ చేశారు. పశువైద్య సిబ్బంది సేవలు అందించారు.

బొబ్బిలి: బ్రోచర్‌ను విడుదల చేస్తున్న వైద్యులు

ప్రజావేదికలో 'అవినీతి' గోల

- పనులకు వెళ్లకుండా మస్తర్లు
- విస్తుపోయిన డ్వామా పీడీ

ప్రజాశక్తి - జామి

ఉపాధి హామీ పనుల్లో భారీ అవినీతి చోటు చేసుకుందని సోషల్ ఆడిట్ బృందాలు వెల్లడించాయి. బుధవారం ఎంపిడిఒ అప్పలనాయుడు అధ్యక్షతన జరిగిన సామాజిక తనిఖీ ప్రజా వేదికలో పనులకు వెళ్లకుండానే మస్తర్లు వేసుకున్న సంఘటనలు దాదాపు అన్ని పంచాయతీల్లో చోటుచేసుకున్నట్లు ఆడిట్ బృందాలు ధ్రువీకరించడంతో డ్వామా పీడీ శారదా దేవి విస్తుపోయారు. మండల లోని 25 పంచాయతీల్లో డిఆర్‌పిలు ఉపాధి పనులు, హౌసింగ్, పింఛన్లు, మొక్కలు నాటడం వంటి అంశాలపై తనిఖీ నిర్వహించి, నివేదికలను ప్రజా వేదికలో వెల్లడించారు. ఇందులో 2020లో మృతి చెందిన వ్యక్తి పేరున మస్తర్లు వేసిన సంఘటనపై సర్వత్రా ఆందోళన వ్యక్తమైంది. సంతకాలు, వేలు ముద్రలు లేకుండా వేతనాలు ఇప్పించిన ఘటనలు బయటపడ్డాయి. ఈ నేపథ్యంలో పీడీ మాట్లాడుతూ మండ లంలో ఉపాధి పనులు తీరు మార్చుకో వాలని హెచ్చరించారు. ఇందులో భాగం గానే అత్యధిక ఫీల్డ్ అసిస్టెంట్లకు భారీగా రికవరీలు రాసినట్లు సమాచారం. కార్యక్రమంలో డ్వామా విజిలెన్స్ అధికారి పి.వెంకటరమణ, క్వాలిటీ అధికారి శ్రీనివాస్ కుమార్, ఏపిడి శ్రీనివాసరావు, సిబ్బంది, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్లను నిలదీస్తున్న డ్వామా పీడీ శారదాదేవి

కాలువలపై నిర్మాణాలు చేయొద్దు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

కాలువలపై ఉన్న పలకలను ఆక్రమించి ఎటువంటి నిర్మాణాలను చేపట్టవద్దని నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య తెలిపారు. అనేక ప్రాంతాలలో కాలువలపై ఉన్న పలకలను ఆక్రమించి మెట్లు, ఇతర నిర్మాణాలు చేపట్టడాన్ని ఆయన గమనించారు. దీనివల్ల కాలువలు పరిశుభ్రత చేసే సమయంలో అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని, దీనివల్ల దుర్గంధ వాతావరణం ఏర్పడుతుందని సిబ్బందిని అప్రమత్తం చేశారు. దీంతో బాబామెట్ట ప్రాంతంలో జెసిబి సహాయంతో పలకలను తొలగించి కాలువల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాలను తొలగించారు.

కమిషనర్ నల్లనయ్య

అనధికార హోర్డింగ్‌లను అనుమతించేది లేదు

అనధికార హోర్డింగులు, ప్రకటన బోర్డులను అనుమతించబోమని కమిషనర్ నల్లనయ్య స్పష్టం చేశారు. రహదారులను ఆక్రమించి, రోడ్లకు ఇరువైపులా ఏర్పాటు చేసిన హోర్డింగ్‌లను కమిషనర్ ఆదేశాల మేరకు ప్రణాళిక సిబ్బంది తొలగించారు. ఎస్.కోట వెళ్లే రహదారి, అయ్యన్నపేట ప్రాంతాలలో అక్కడక్కడ ఏర్పాటు చేసిన బోర్డులను తొలగించారు. అనుమతి లేని హోర్డింగులు, ఫ్లెక్స్ బ్యానర్లు ఏర్పాటు చేసిన వారితోనే తొలగించి వేయడంతో పాటు అపరాధ రుసుములు విధిస్తామని స్పష్టం చేశారు

రైతులతో మాట్లాడుతున్న ఆర్‌డిఒ దాట్ల కీర్తి

విమానాశ్రయ అప్రోచ్ రోడ్డుకు సహకరించండి

రైతులను కోరిన ఆర్‌డిఒ కీర్తి

ప్రజాశక్తి - భోగాపురం

విమానాశ్రయ అప్రోచ్ రోడ్డు నిర్మాణానికి సహకరించాలని ఆర్‌డిఒ దాట్ల కీర్తి రైతులను కోరారు. గూడెపువలస రెవెన్యూ పరిధిలో 20 ఎకరాలకు అవార్డు పాస్ చేయడం జరిగిందని, పరిహారం కోర్టులో ఉన్నందున అది కూడా త్వరలో వస్తుందని గ్రామ సర్పంచ్ అయ్యప్పరెడ్డితో పాటు రైతులకు తెలిపారు. ముంజేరు సమీపంలో నిర్మిస్తున్న భద్రత సిబ్బంది నివాస గృహాలకు వెళ్లే రహదారిని బుధవారం ఆమె పరిశీలించారు. రహదారికి భూములు ఇవ్వాలని సంబంధిత రైతులను కోరారు. తహశీల్దార్ ఎం సురేష్, సర్వేయర్ ముదికేశ్వరరావు, దల్లి పేట మాజీ సర్పంచ్ దల్లి శ్రీనివాసరావు, జిఎంఆర్ ప్రతినిధి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

గెస్ట్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తులు

ప్రజాశక్తి- శృంగవరపుకోట

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మాథ్స్ సబ్జెక్టు గెస్ట్ లెక్చరర్ పోస్టుకు ఫిబ్రవరి 3వ తేదీలోగా దరఖాస్తులు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సిహెచ్ కేశవరావు బుధవారం తెలిపారు. ఎమ్మెస్సీ మ్యాథమెటిక్స్‌లో 55శాతం మార్కులు సాధించిన వారు అర్హులు అని అన్నారు. అర్హత, ఆసక్తి గల అభ్యర్థులు ఫిబ్రవరి 3వ తేదీ సాయంత్రం 5గంటల లోపు కళాశాల కార్యాలయంలో దరఖాస్తులను సమర్పించాలని ప్రిన్సిపాల్ కోరారు.

జాబ్‌మేళాలో 63 మంది ఎంపిక

ప్రజాశక్తి- రాజాం

ప్రభుత్వ ఐటిఐలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన జాబ్ మేళాలో వివిధ కంపెనీల్లో ఉద్యోగాలకు 63 మంది ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపల్ పి.భాస్కరరావు తెలిపారు. ఈ జాబ్ మేళాలో జిల్లా నలుమూల నుంచి 178 మంది హాజరుకాగా వివిధ మౌలిక పరీక్ష అనంతరం 63 మంది అభ్యర్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారన్నారు. ఈ కార్యక్రమంలో స్కిల్ డెవలప్మెంట్ అధికారి టి.భాస్కర్, ఎంప్లాయిమెంట్ యంగ్ ప్రొఫెషనల్ యశ్వంత్, సీడాప్ సిబ్బంది, కళాశాల స్కిల్ డెవలప్మెంట్ తదితరులు సిబ్బంది పాల్గొన్నారు.

ఎవరికి ఏ సమస్య వచ్చినా ఫోన్ చేయండి

ప్రజాశక్తి - కొత్తవలస

మండలంలోని సర్పంచులు, ఎంపిటిసిలు ఎవరిక ఏ సమస్య వచ్చినా తనకు ఫోన్ చేస్తే పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం ఎంపిపి నీలంశెట్టి గోపమ్మ అధ్యక్షతన, ఎంపిడిఒ ఎస్.రమణయ్య నిర్వహించారు. సమావేశంలో మంచినీటి కొళాయిలు వేయాలని కాటకాపల్లి, చినరావుపల్లి, కంటకాపల్లి, అప్పన్న దొరపాలెం సర్పంచులు అడిగారు. ఎమ్మెల్సీ రఘురాజు మాట్లాడుతూ సర్పంచ్‌లందరికి విధిగా గౌరవం ఇవ్వాలని అధికారులకు సూచించారు. పలువురు సర్పంచులు మాట్లాడుతూ తమ గ్రామాల్లోకి అధికారులు వచ్చిన సమాచారం ఇవ్వటం లేదన్నారు. విధిగా ప్రోటోకాల్ పాటించాలని ఎమ్మెల్సీ అధికారులు ఆదేశించారు. మండలంలో ఏ గ్రామానికి ఏ అధికారి వచ్చిన సర్పంచులకు తప్పనిసరిగా ముందుగా సమాచారం ఇవ్వాలని అలా ఇవ్వకుంటే ఊరుకొనేది లేదని హెచ్చరించారు. ఈ సమావేశంలో తహశీల్దార్ నీలకంఠారావు, సర్పంచులు, ఎంపిటిసిలు తదితరులు పాల్గొన్నారు.

వేపాడలో ముగిసిన జాతర

ప్రజాశక్తి - వేపాడ

వేపాడ, వల్లంపూడి జంట గ్రామాలలో నిర్వహించిన ముత్యాలమ్మ, పరదేశమ్మ జాతర బుధవారం ముగిసింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఎడ్ల పరుగు పందెంలో విజేతగా నిలిచిన ఎడ్ల యజమాని కెఆర్‌పేటకు చెందని శ్రీదుర్గాలమ్మ బండికి రూ.20వేలు, రెండవ బండి వంటాకు సూర్యనారాయణకు రూ.15వేలు, మూడవ బండి వావిలపాడు పరదేశిమ్మకు రూ.10వేలు బహుమతులను ప్రదానం చేశారు. రంగవల్లులు పోటీలో విజేతలకు బహుమతులను గ్రామ సర్పంచ్ ఎం అర్జున్ అమ్మ, గ్రామ పెద్దలు, ఉత్సవ కమిటీ సభ్యులు చేతుల మీదుగా అందజేశారు. అనంతరం నిర్వహించిన డాన్స్ బేబి డ్యాన్స్ కురక్రారును ఉర్రూతలూగించింది.

రావాడ వసతి గృహాన్ని పరిశీలించిన ఎంపిపి

ప్రజాశక్తి - భోగాపురం

మండలంలోని రావాడలో బీసీ బాలుర వసతి గృహాన్ని ఎంపిపి ఉప్పాడ అనూష రెడ్డి బుధవారం పరిశీలించారు. వసతి గృహంలోని సమస్యలను వార్డెన్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం తుపాను షెల్టర్‌లో ఉన్న అంగన్వాడి కేంద్రాన్ని పరిశీలించారు. చిన్నారులకు పౌష్టిక ఆహారాన్ని సక్రమంగా అందజేయాలని టీచర్‌కు సూచించారు. ప్రాథమిక పాఠశాలను పరిశీలించి చిన్నారులతో కూర్చొని మధ్యాహ్న భోజనాన్ని రుచి చూశారు. వైసిపి నాయకులు ఉప్పాడ సూర్యనారాయణ రెడ్డి, ఎంపిడిఒ గాయత్రి, వైస్ ఎంపిపి రావాడ బాబు, సర్పంచ్ అప్పురబుక్త పైడినాయుడు, ఇంజనీరింగ్ అధికారి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు బోనస్ చెల్లింపు

ప్రజాశక్తి - నెల్లిమర్ల

కార్మిక సంఘాల ఒత్తిడి మేరకు జ్యూట్ యాజమాన్యం కార్మికులకు బోనస్ చెల్లించిందని జ్యూట్ మిల్ వర్కర్స్ యూనియన్ నాయకులు కిల్లంపల్లి రామారావు తెలిపారు. బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ జ్యూట్ యాజమాన్యం కార్మిక సంఘాల ఒత్తిడి మేరకు 2023 సంవత్సరానికి చెందిన బోనస్ కార్మికులకు చెల్లించిందని తెలిపారు. గత 9నెలలుగా జ్యూట్ యాజమాన్యం మిల్లును అక్రమ లాకౌట్ చేసి బోనస్ కూడా ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేసిందన్నారు. ఈ నేపథ్యంలో కార్మిక సంఘాలు ఐకమత్యంతో పోరాడి బోనస్ సాధించుకున్నాయన్నారు. ఇదే స్ఫూర్తిగా మిల్లును తెరిపించడానికి పోరాటం చేస్తామని రామారావు తెలిపారు.

IN THE HONOURABLE COURT OF II ADDL. JUNIOR CIVIL JUDGE, VIZIANAGARAM
O.S.250/2024

Between:
Gottumukkala Venkataramaraju ....Plaintiff.
And
To
Varipilli Krishna Rao, Managing Director, Subhakari Builders & Developers. Town Center Layout, 100 Feet Ring road, Vizianagaram Town & District. ....Defendant.

NOTICE

Please take notice that the plaintiff filed the above suit against you and the same was stand posted on dt.14-02-2025 for your appearance. Hence you are required to attend on **dt.14-02-2025 by 10:30 am** personally or through Advocate. As otherwise matter will be decided as per procedure.

Shaik Rahim.
ADVOCATE,
VIZIANAGARAM
Ph: 9440540386

Dt.29-01-2025.
Vizianagaram.